## క్లుప్తంగా

### టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆజాద్ ఫౌండేషన్ ఈ వితరణ చేపట్టింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు, ప్రతినిధులు కుడుపూడి శాంతిభూషణం, రంకిరెడ్డి కాశీ తదితరులు ఈ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి దొడ్డా కాశీ, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ సీహెచ్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ యార్డు పరిశీలన



ఉప్పలగుప్తంలో మార్కెట్ కమిటీ భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ దోలామణి

**ఉప్పలగుప్తం:** ఉప్పలగుప్తంలో నిర్మాణంలో ఉన్న మార్కెట్ కమిటీ యార్డు భవనాన్ని ఏఎంసీ చైర్మన్ దంగేటి దోలామణి, జిల్లా అధికారి కేవీఎస్ విశాలాక్షితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దోలామణి మాట్లాడుతూ గోడౌన్ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేతో చర్చించామని, త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. వీరి వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ బదుగు మేరీకుమారి, డైరెక్టర్లు చప్పిడి దుర్గారావు, నిమ్మకాయల కోటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, నాయకుడు దంగేటి రుద్ర తదితరులు ఉన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఉప్పలగుప్తంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చిన్నవరాజు

**ఉప్పలగుప్తం:** గ్రామ పంచాయతీ పరిధి పెద్దూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను గుర్తించి, అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, మోటూరి సత్యంకాపు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శిగా వివేక్



**ఉప్పలగుప్తం:** డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని భీమనపల్లి గ్రామ పంచాయితీ పరిధి సూదాపాలేనికి చెందిన రాయపురెడ్డి వివేక్ నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం నుంచి ఇటీవల ఉత్తర్వులు అందినట్టు వివేక్ శుక్రవారం తెలిపారు. మండలానికి చెందిన పలువురు నాయకులు వివేక్‌కు అభినందనలు తెలిపారు.

### అండగా నిలిచే వారికే మద్దతివ్వండి: మాజీ ఎంపీ

**అల్లవరం:** మాలలకు అండగా నిలిచే నాయకుల్నీ వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని, ఇతర జిల్లాల వారు మీ ప్రాంతాల్లో పోటీ చేస్తే వారికి ఓటు వేయవద్దని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. మాలలకు ఎవరి వల్ల అన్యాయం జరిగిందో ఫిబ్రవరి 8న జరగబోయే మాలల సింహగర్జనలో వెల్లడిస్తానన్నారు. మండలంలోని కోడూరుపాడులో శుక్రవారం జరిగిన ఆత్మీయ కలయిక సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు తాను ఎంపీగా ఉన్న సమయంలో పలు అభివృద్ధి పనులు చేశానని, ప్రజలు ఆశీర్వదిస్తే వచ్చే ఎన్నికల్లోనూ పోటీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చిట్టూరి తేజ, సత్తి బాపూజీ, సాధనాల వెంకటరావు, గెద్దం సురేష్‌బాబు, ఇసుకుపట్ల రఘుబాబు, ఈతకోట బాలస్వామి, బొంతు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ రాజ్యం జగన్‌తోనే సాధ్యం



కందికుప్పలో కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పటవల పంచాయతీలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

**తాళ్లరేవు:** పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. పటవల పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ రాయుడు సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇది కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేయాలని కోరారు. పథకాల బోర్డును, పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కాలా వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ, నాయకులు రాయుడు గంగాధర్, కొప్పిశెట్టి వెంకట్, సత్యనారాయణ, చందు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**ఓడలరేవులో..**

**అల్లవరం:** ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం ఓడలరేవు సచివాలయం వద్ద సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథి ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, రాష్ట్రానికి జగనన్న అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్ని గెలిపించి మరోమారు ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డుని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, పార్టీ నాయకులు మల్లాడి ఉమామహేశ్వరరావు, మధుర కుమారస్వామి, అవనిగడ్డ శేషగిరిరావు, పెచ్చెట్టి బాబ్జి, పెచ్చెట్టి నరసింహరాజు, మల్లాడి అర్జునరావు, చిలకలపూడి సత్యనారాయణ, రేవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్నకు అండగా ఉండండి**

**కాట్రేనికోన:** రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు తీసుకువెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని జెడ్పీటీసీ నేల కిషోర్ అన్నారు. కందికుప్పలో సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయం ద్వారా లబ్ధిదారులకు అందించిన పథకాల బోర్డును జెడ్పీటీసీ ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. నాయకులు ఇంటింటికీ కరపత్రాలను పంచి, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ లబ్ధిని లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వానికి తోడుగా నిలవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు అన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లగల అప్పారావు, చిన్నారావు, బొంతు అజయ్‌కుమార్, గుణవీణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓడలరేవు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

## ముక్కోటికి సిద్ధమైన ఉత్తర ద్వారం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం సిద్ధం చేసిన బారికేడ్లు

**అమలాపురం టౌన్:** కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరొందిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు శుక్రవారం సాయంత్రానికి పూర్తయ్యాయి. ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉత్తర (వైకుంఠ) ద్వారం మీదుగా స్వామి వారిని భక్తులను దర్శించుకునేందుకు వీలుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణమంతా షామియానాలు నెలకొల్పారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారికి లక్ష చామంతి పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం మొదలవుతుందని పేర్కొన్నారు. దాదాపు 50 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారన్న అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ఈఓ దూనబోయన సాయిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దివ్యాంగుల స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు



శాంతాక్లాజ్ దుస్తుల్లో విద్యార్థులు

**యానాం:** యానాం ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ జగదీష్ దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. స్కూల్ ఇన్‌ఛార్జి కె శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని మతాల పండగలను దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించి, వాటి ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యా టీచర్లు సుశీల, మహేశ్వరి, ఉదయ కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**సాకుర్రులో క్రిస్మస్ వేడుకలు**

**అమలాపురం రూరల్:** అమలాపురం మండలంలో శుక్రవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సాకుర్రులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ అలంకరణల్లో ఆకట్టుకున్నారు. క్రిస్మస్ కేక్‌ను పాఠశాల కరస్పాండెంట్ ముమ్మిడి ప్రతాప్ కుమార్ కట్ చేశారు. అమలాపురం మన్నా జూబ్లి చర్చి పాస్టరు ఎర్నెస్ట్ తాతాపూడి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 450కి పైగా కేసులు

**తాళ్లరేవు:** జాతీయ రహదారి 216 కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు నెలల్లో 450కి పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రూ.30 లక్షలకు పైగా జరిమానా వసూలు చేశారు. జాతీయ రహదారి 216 కోరంగి స్టేషన్ పరిధిలో అటు యానాం నుంచి ఇటు చొల్లంగి వరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై శనగశెట్టి రవికుమార్ రెండు నెలలుగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. రెండు నెలల్లో 450కి పైగా కేసులు నమోదయ్యాయి. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఇప్పటివరకు 300 కేసులకు సంబంధించి రూ.30 లక్షల జరిమానా వసూలు చేసినట్టు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

**యానాం:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో యానాం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు శుక్రవారం ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి, మెట్టకూరు జవహర్ నవోదయ నుంచి ఎస్‌వీవీఎస్‌సీవీఎస్ ప్రణీత్, శౌర్యవీర్, ఎస్‌కే మెహనాజ్ జట్టు ప్రథమ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి రీజెన్సీ నుంచి పి.హర్షదీప్, సీహెచ్ ఇషి డేనియేల్, టీఎస్‌వీ హర్షిత జట్టు ప్రథమ స్థానాలు పొందాయి. కమలానెహ్రూ ప్రభుత్వ బాలికల హైస్కూల్ నుంచి, ప్రైవేట్ స్కూల్స్ విభాగం నుంచి నల్లం కాన్సెప్ట్ స్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. జనవరి 7న జరిగే జిల్లా స్థాయి సైన్స్ సంబరాల్లో విజేతలు పాల్గొంటారు.

### వైభవంగా హనుమాన్ రథోత్సవం

**అమలాపురం టౌన్:** అమలాపురం యర్రమిల్లివారి వీధి వర సిద్ధి హనుమాన్ మందిరం ఆధ్వర్యంలో హనుమాన్ రథోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. హనుమాన్ మందిరంతో హనుమత్ వ్రత పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం స్వామి వారి రథాన్ని భక్తులు లాగారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ రథోత్సవం సాగింది. ఊరేగింపులో భారీ హనుమంతుని వేషధారణ, కోతుల వేషధారణ, సీతారామలక్ష్మణ వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం మందిరం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

## దళితుల ఐక్యతే పీవీ రావు లక్ష్యం



అల్లవరంలో పీవీ రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సోదరుడు నాగరాజు తదితరులు

**ఐ.పోలవరం:** వర్గీకరణ పేరుతో దళితులను విభజించి పాలించిన ఆనాటి ప్రభుత్వాలకు ఎదురునిలిచి, దళితుల ఐక్యతకు తన ప్రాణాలను సైతం లెక్క చేయని మహనీయుడు పీవీ రావు అని జిల్లా మాల మహానాడు కార్యదర్శి రేవు శ్రీను అన్నారు. పాతయింజరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీ రావు వర్ధంతిని అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు రేవు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పించారు.

**అల్లవరం:** దివంగత నేత పీవీ రావు వర్ధంతిని దేవగుప్తంలోని ఆయన నివాసంలో సోదరుడు పోతుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రులో బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీవీ రావు వర్ధంతి జరిగింది.

**ముమ్మిడివరం:** ప్రజా సంఘాలు, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో పీవీ రావు వర్ధంతి నిర్వహించారు. పోలమ్మ చెరువు గట్టున జై బుద్ధవిహార్‌లో వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనాతవరంలో పీవీ రావు వర్ధంతి జరిగింది.

**అమలాపురం టౌన్:** మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతి స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో జిల్లా మాల మహానాడు నాయకులు నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పినిపే రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏకే భీమారావు అతిథిగా పాల్గొన్నారు. సంఘ జిల్లా నాయకులు రేవు ప్రసాద్, నామాడి శ్రీధర్, ఉప్పిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పీవీ రావు విగ్రహానికి ఘన నివాళి**

**ఉప్పలగుప్తం:** మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు వర్ధంతిని ఆయన అభిమానులు మండలంలో పలుచోట్ల నిర్వహించారు. ఎస్.కొత్తపల్లిలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి ఆధ్వర్యంలో పీవీ రావు విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కొంకి గంగాధరరావు, బాబురావు, విజయ్, కృష్ణమూర్తి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామానికి వన్నె తెచ్చిన ఆణిముత్యాలు

ఎస్సై పరీక్షల్లో విజయం సాధించిన లోకేశ్వరి, కవితకు సన్మానం



బలుసుతిప్పలో లోకేశ్వరి, కవితను సన్మానిస్తున్న గ్రామస్తులు

**కాట్రేనికోన:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన బలుసుతిప్పకు చెందిన రామాడి కవిత, తిరుమాని లోకేశ్వరి ఎస్సై పరీక్షల్లో విజయం సాధించి గ్రామానికి వన్నె తెచ్చారని సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ఇసుకపట్ల శ్రీనుబాబు అన్నారు. బలుసుతిప్పలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు అధ్యక్షతన లోకేశ్వరి, కవితకు సన్మాన సభ జరిగింది. పల్లంకుర్రు పంచాయతీ రామాలయంపేట గ్రామస్తులు వీరిని సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డంకి కాదని, నిజాయితీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. లోకేశ్వరి మాట్లాడుతూ ఆడపిల్లనని తనను ఇంటికే పరిమితం చేయకుండా ఉన్నత చదువులకు ప్రోత్సహించారని చెప్పారు. కవిత మాట్లాడుతూ 1996 తుపానులో తండ్రి మరణించినా, అమ్మ చదివించిందని, తన భర్త ప్రోత్సాహంతో విజయం సాధించానన్నారు.

**ఎస్సైగా ఎంపికైన రమేష్‌కు అభినందన**

**ఉప్పలగుప్తం:** గోపవరం గ్రామానికి చెందిన తాళ్ల రమేష్ ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఎంపిక కావడంతో మండలానికి చెందిన గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు అభినందించారు. గోపవరం గ్రామంలో రమేష్ నివాసంలో శుక్రవారం దుశ్శాలువాతో సత్కరించారు.

### న్యాయవాది కిషోర్‌కు డాక్టరేట్



వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కిషోర్

**అమలాపురం రూరల్:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో చేసిన పరిశోధనకు అయలాపురం మండలం సమనస గ్రామానికి చెందిన న్యాయవాది పరమట కిషోర్‌కు డాక్టరేట్ లభించింది. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ద్వారా ఏ సోషియో-లీగల్ స్టడీ ఆన్ ఉమెన్ ట్రాఫికింగ్ అనే అంశంపై ఈ పరిశోధన చేశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి ఇటీవల డాక్టరేట్‌ను అందజేశారు.

## గణితంలో రామానుజన్‌కు ఘన కీర్తి

గణితావధాని డాక్టర్ సూర్యనారాయణమూర్తి



అమలాపురంలో రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సూర్యనారాయణమూర్తి తదితరులు

**అమలాపురం టౌన్:** దేశం గర్వపడేలా శ్రీనివాస రామానుజన్ గణితంలో ఖండాంతరాల ఖ్యాతిని సొంతం చేసుకున్నారని గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి అన్నారు. గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణమూర్తి దేశంలో గణితానికి వన్నె తెచ్చిన మహనీయులపై మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గణితవేత్త రామానుజన్ కీర్తిని కొనియాడారు.



పాలగుమ్మి జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ డే అక్షరాలు సమకూర్చిన విద్యార్థులు

**ఘనంగా గణిత దినోత్సవం**

**ఉప్పలగుప్తం:** ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలో పలు పాఠశాలల్లో గణిత దినోత్సవాలు నిర్వహించారు. భీమనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ-2 సత్తి సత్యకృష్ణ పాఠశాలను సందర్శించి, రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. హెచ్ఎం నూకల సత్యనారామణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పిల్లలతో 1729 సంఖ్య ప్రదర్శన**

**ఐ.పోలవరం:** జి.వేమవరం జెడ్పీ పాఠశాలలో శుక్రవారం రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. 1729 సంఖ్యను పిల్లలు ప్రదర్శించారు. హెచ్ఎం సలాది వెంకటనారాయణ, ఉపాధ్యాయులు వరలక్ష్మి, భగవాన్, జి.శ్రీనివాస్, సుజాత కుమారి తదితరులు రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రుపాలెం, టి.కొత్తపల్లి తదితర పాఠశాలలో రామానుజన్ జయంతి నిర్వహించారు.

**మ్యాథ్స్ డే అక్షరాల్లో ఒదిగి..**

**అమలాపురం రూరల్:** పాలగుమ్మి జెడ్పీ హైస్కూల్‌లో రామానుజన్ జయంతి సందర్భంగా మ్యాథ్స్ డే నిర్వహించారు. విద్యార్థులు మ్యాథ్స్ డే అక్షరాల్లో ఒదిగి అబ్బురపరిచారు. హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓడలరేవు హైస్కూల్లో..**

**అల్లవరం:** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ జయంతిని ఓడలరేవు హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం శెట్టిబత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. రామానుజన్ సంఖ్య 1729 విశిష్టతను వివరించారు.

**యానాం:** గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని యానాం నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మ్యాథ్స్ డే వేడుకలు జరిగాయి. విద్యార్థులకు రూబిక్ పోటీలను నిర్వహించారు. నూతనంగా నిర్మించిన మ్యాథ్స్ పార్క్‌ను విద్యార్థులు సందర్శించారు. రామానుజన్ జయంతిని రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, గణిత క్విజ్ పోటీలను నిర్వహించారు. స్థానిక నారాయణ ఇ టెక్నో స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం జరిగింది.

### మా ఇంటి దైవం జగనన్న

సీఎం జగన్ పుట్టిన రోజు నాడే గృహ ప్రవేశం



సీఎం జగన్ చిత్రపటంతో నూతన గృహ ప్రవేశం చేస్తున్న శ్రీనివాసరావు దంపతులు

**తాళ్లరేవు:** నిలువ నీడలేని ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టుకునేందుకు రుణం ఇచ్చి వారి సొంతింటి కలను సాకారం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. తమ చిరకాల కలను నెరవేర్చిన సీఎం జగన్‌పై అభిమానులు వినూత్నంగా తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారిపేట జగనన్న కాలనీలో పోలవరపు శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు ప్రభుత్వ సహకారంతో ఇంటిని నిర్మించుకున్నారు. తమ కష్టాలను తీరుస్తూ ఇల్లు నిర్మించుకునేందుకు కారకుడైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజునాడే నూతన గృహ ప్రవేశం చేస్తామని కంకణం కట్టుకున్నారు. అనుకున్నట్టుగానే వారు గురువారం 'మా ఇంటి దైవం జగనన్న' అంటూ సీఎం జగన్ చిత్రపటంతో తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ సమక్షంలో గృహ ప్రవేశం చేశారు.

### చిరంజీవికి కీలక బాధ్యతలపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

**అమలాపురం రూరల్:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవికి మంగళగిరిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడమే కాకుండా, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బండారులంకలో పార్టీ చేనేత విభాగం సమావేశం హర్షం వ్యక్తం చేసింది. బండారులంకలో శుక్రవారం కాలెపు భీమేశ్వర సిద్ధాంతి స్వగృహం వద్ద పార్టీ కోనసీమ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు అధ్యక్షతన విభాగం జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చిరంజీవి విజయానికి రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులతో కలిపి తామంతా కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చేనేత కార్మికులంతా అండగా నిలిచి, విజయాన్ని అందిస్తామని వెల్లడించారు. చేనేత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చేనేత కార్మికులంతా రుణపడి ఉంటారని చెప్పారు. చేనేత కార్మికులకు సహకరిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ రుణం తీర్చుకుంటామన్నారు. ఈ సమావేశంలో విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందన శంకర్రావు, పీఎంసీ చైర్మన్ పెదపూడి బాబురావు, పార్టీ నాయకులు కాశిన చిట్టిరాజు, బట్టు టాక్సీ రామ్ పాల్గొన్నారు.

### పంచాయతీరాజ్ డీఈఈగా శ్రీనివాసరావు



డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును అభినందిస్తున్న దృశ్యం

**ముమ్మిడివరం:** పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డీఈఈగా మండల పంచాయతీరాజ్ ఏఈ పీవీ శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాత్కాలిక డీఈఈగా ఉన్న అన్యం రాంబాబు నుంచి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఈఈగా పనిచేసిన జీబీవీ రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కార్యాలయ ఉద్యోగులు, అధికారులు అభినందనలు తెలిపారు.

### అంబులెన్స్ డ్రైవర్లకు జీతాలివ్వాలి

**యానాం:** యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 108 అంబులెన్స్ డ్రైవర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని పలువురు డ్రైవర్లు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 108 సేవలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో నవంబర్ జీతాలూ విడుదల చేయలేదన్నారు.

### 25 నుంచి సంకల్ప యాత్ర

**యానాం:** వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఈ నెల 25 నుంచి నియోజకవర్గ పరిధిలో రెండో దశ నిర్వహిస్తున్నట్టు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, యాత్ర షెడ్యూల్‌ను వివరించారు.

### సైన్స్ మహాసభ

**అమలాపురం రూరల్:** ఎస్‌కేబీఆర్ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం కోనసీమ సైన్సు పరిషత్ 2870 సైన్సు మహాసభ నిర్వహించారు. సైన్సు టెంపర్-వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ ప్రసంగించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ కుమారశాస్త్రి, లెక్చరర్లు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

**అమలాపురం టౌన్:** చెడు అలవాట్లకు బానిసై, తలకు మించిన అప్పులు చేసిన ఓ యువకుడు తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామానికి చెందిన కొప్పుల నాగ శివసాయి (28) అమలాపురం పట్టణం కుమ్మర్ల వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. బీటెక్ చదువుకున్న అతడు గతంలో ఆన్‌లైన్ తదితర బెట్టింగ్‌ల్లో పెట్టుబడులు పెట్టి దాదాపు రూ.కోటి వరకూ అప్పుల పాలయ్యాడు. వ్యసనాలకు బానిసై, అప్పుల బాధ తట్టుకోలేక శుక్రవారం ఉదయం తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ టి.కాంత్రికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.